

రథసప్తమి వేడుకలపై నేడు అభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో రథసప్తమి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, ధార్మిక సంస్థలు, ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.



పట్టుబడిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి (ఫైల్)

మిగిలిన నిందితులెవరు?

- వీడని మిస్టరీగా.. టీడీపీ నేత నాగరాజుపై హత్యాయత్నం కేసు
- కొంతమంది మాత్రమే అరెస్టు
- మరికొందరిని పట్టుకోవడంలో జాప్యం
- స్పష్టత రాని బీహారీ గ్యాంగ్ సుపారీ వ్యవహారం
- కేసు నీరుగారుతోందనే విమర్శలు

పలాస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గకు చెందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజుపై హత్యాయత్నం కేసు నీరుగారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల నాగరాజును హత్య చేయించేందుకు గానూ.. కొంతమంది వైసీపీ నాయకులు.. బీహార్ ముఠాకు సుపారీ ఇచ్చి రప్పించిన విషయం తెలిసిందే. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టింది. ఈ కేసుకి సంబంధించి నలుగురు వైసీపీ నాయకులు, ముగ్గురు బీహార్ గ్యాంగ్‌ను పోలీసులు గత నెల 21న అరెస్టు చేశారు. వారి నుంచి మూడు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా కొంతమంది వైసీపీ నాయకుల ప్రమేయం ఉందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆ రోజు వెల్లడించారు. కానీ ఇంత వరకూ ఆ మిగిలిన వారి వివరాలు బయటకు పొక్కలేదు. వారిని అరెస్టు చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఈ కేసు ఇక నీరుగారినట్లేనా అనే ప్రచారం సాగుతోంది. నాగరాజుపై హత్యాయత్నానికి సంబంధించి అసలు నిందితులు పట్టుబడినా.. వారికి ప్రోత్సహించిన వారు, హత్య కోసం నగదు ఖర్చు చేసిన వారు ఎవరనే సందేహాలు ఇంకా వీడలేదు. ఇప్పటికే నాగరాజు నివాసం ఉండే చిన్నబడాం గ్రామానికి చెందిన అనేక మందిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతుండడంతో.. ఇంకా మిగిలిన నిందితులు పట్టుబడతారో.. లేదోనన్నది చర్చనీయాంశమవుతోంది.

సుపారీ ఎవరిచ్చారు?

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చిన్నబడాం గ్రామంలోనే టీడీపీ నాయకులపై ఎక్కువగా వేధింపులు జరిగాయని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా.. ఇంకా అదే పెత్తనం చెలాయించడానికి నాగరాజు, ఆయన అనుచరులు అడ్డుకున్నారు. దీంతో నాగరాజును శాశ్వతంగా తొలగించడానికి వేసిన వ్యూహంలో భాగంగానే బీహార్ నుంచి సుపారీ గ్యాంగ్‌ను వైసీపీ నాయకులు రప్పించగా.. ప్రయత్నం విఫలమైంది. దీనిపై పోలీసులు ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. అయితే సుపారీ ఎవరు ఇచ్చారు? వారిని బీహార్ నుంచి రప్పించింది ఎవరు, తుపాకులు ఎవరు సమకూర్చారు. ఈ ప్రాంతీయులతో వారికి ఉన్న అనుబంధం ఏమిటనేది పోలీసులు నిగ్గు తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ జంటపట్టణ ప్రజలు, టీడీపీ నేతల్లో కొత్త భయం వెంటాడుతోంది. బీహార్ గ్యాంగ్ ప్రస్తుతం జైలులో ఉండగా, వారు బెయిల్‌పై విడుదలైతే పలాసలో మకాం పెట్టే అవకాశం ఉంది. తర్వాత జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర దర్యాప్తు చేసి అసలు నిందితులతో పాటు సుపారీ గ్యాంగ్‌కు ఆశ్రయం ఇచ్చిన వారు, రప్పించిన వారిపై కూడా నిఘా పెట్టాల్సి ఉంది.

ప్రత్యేక బృందాల గాలింపు..

బీహార్ గ్యాంగ్ సుపారీ కేసునకు సంబంధించి పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇప్పటికే ఏడు మందిని అరెస్టు చేశామని, పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేరానికి పాల్పడినవారిని ఎవర్నీ ఉపేక్షించేది లేదన్నారు.

ఫసల్ బీమా యోజన సాయం

రూ.10వేలకు పెంపు

- జిల్లాలో 2.30 లక్షల మంది రైతులకు లబ్ధి
- రూ.1,350కే డీఏపీ బస్తా
- యూనిక్ నెంబరుతో గుర్తింపు కార్డులు



నరసన్నపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయి. అన్నదాతకు అండగా ఉండేలా.. కేంద్రమంత్రి మండలి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రైతులకు వరాల జల్లు కురిపించింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఏటాకు రైతులకు అందిస్తున్న సాయాన్ని రూ.6వేల నుంచి రూ.10 వేలకు పెంచింది. 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఏటా రైతులకు మూడు విడతల్లో రైతులకు రూ.6వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. కేంద్రమంత్రి మండలి ఆమోదం మేరకు ఇక వచ్చే ఏప్రిల్ నుంచి నాలుగు విడతల్లో రూ.2,500 చొప్పున రైతుల ఖాతాల్లో మొత్తం రూ.10వేలు జమ చేయనున్నారు. జిల్లాలో 2.30 లక్షల మంది రైతులకు లబ్ధి కలుగునుంది. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సాయం కూడా అదనంగా అందనుంది. అలాగే డీఏపీపై సబ్సిడీకి అదనంగా రూ.2,625కోట్లు వన్ టైం స్పెషల్ ప్యాకేజీకి కేంద్రమంత్రి మండలి ఆమోదించింది. ఇకపై 50 కిలోల బస్తా రూ.1,350 లభిస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు గుర్తింపు కార్డులు..

సొంత భూమి కలిగిన రైతులకు ప్రభుత్వం యూనిక్ నెంబర్‌తో గుర్తింపు కార్డులు అందజేయనుంది. ఈ కార్డుల ద్వారా సంక్షేమ పథకాలు, రాయితీలు పారదర్శకంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు రైతు పేరుమీద ఉన్న భూమి, పంటల వివరాలను అగ్రిస్టాక్ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తారు. ఇప్పటివరకు ఒక రైతుకు వేర్వేరు ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉంటే రకరకాల ఖాతా నంబర్లుతో ఉంటాయి. రైతు గుర్తింపు కార్డు ప్రక్రియ పూర్తి చేస్తే యూనిక్ ఐడీ నంబరు ఒకటే ఉంటుంది. ఒక రైతు పేరున ఎక్కెడెక్కడ భూములు ఉన్నాయో గుర్తింపు కార్డు

(మిగతా 6వ పేజీలో...)



హర్షణీయం..

మోదీ సర్కార్ రైతులకు పీఎం ఫసల్‌బీమా యోజనపథకం ద్వారా రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం రూ.6వేలు నుంచి రూ.10వేలకు పెంచడం హర్షణీయం. గతంలో కంటే వ్యవసాయ పెట్టుబడులు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం సాయం పెంచడం ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

- బైరి తవిటయ్య, రైతు, తామరాపల్లి

పెట్టుబడులు తగ్గుతాయి

డీఏపీ ధరలు తగ్గడంతో ఎకరా సాగుకు రూ.2వేలు వరకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. యూనిక్ నెంబరుతో గుర్తింపు కార్డులు జారీ చేస్తే.. చిన్న సన్నకారుల రైతులకు ఎంతో సహకారం లభిస్తుంది.

- యాళ్ల వేణుగోపాలరావు, రైతు, మాకివలస





బారువ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్, అధికారులు

సోంపేటలో ఎయిర్‌పోర్టు!

- ఆర్డీవో స్థల పరిశీలన

సోంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తీవ్ర కృషి చేస్తున్నారు. ఇప్పటికే వజ్రపుకొత్తూరు మండలంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ మేరకు స్థలాన్ని సేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. కాగా.. అక్కడ స్థలం ఇచ్చేందుకు కొందరు నిరాకరిస్తున్నారు. దీంతో సమాంతరంగా సోంపేట మండలంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పలాస ఆర్డీవో జి.వెంకటేశ్ గురువారం బారువ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో స్థల పరిశీలన చేశారు. 1000 ఎకరాలను గుర్తించారు. బారువ, బారువకొత్తూరు, కొర్లాం, లక్కవరం, పలాసపురం గ్రామాలకు చెందిన రైతుల భూములను పరిశీలించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించి.. అనంతరం భూ సేకరణకు సంబంధిత రైతులను ఒప్పించి ఎయిర్‌పోర్టు నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, సర్వేయర్లు శశిభూషన్, కే.కుమారి ఉన్నారు.

కోనేరును ఆక్రమిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ హెచ్చరిక



పైడిభీమవరంలో సుద్ద కోనేరును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రణస్థలం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : పైడిభీమవరంలో సుద్ద కోనేరును ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎన్.ప్రసాద్ హెచ్చరించారు. గ్రామస్థులు సాగు, ఇతరత్రా అవసరాలు తీర్చే సుద్ద కోనేరు ఆక్రమణల చెరలో చిక్కింది. 2.36 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కోనేరు చిన్నపాటి కాలువగా మిగిలింది. సుమారు రూ.40 కోట్ల విలువ చేసే భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో స్థానికుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. దీనిపై 'ఇక్కడో కోనేరుండేది' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందిస్తూ తహసీల్దార్ నేతృత్వంలో అధికారులు గురువారం ఆ కోనేరును పరిశీలించారు. గట్టును చదును చేసినట్టు గుర్తించారు. ఆక్రమణలు చేసినా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు. ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతవరకూ పక్కనే ఉన్న ఆలయ కమిటీకి కోనేరు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కోనేరు రక్షణకు చర్యలు చేపడుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్



డీఎంహెచ్‌వోకు ఉద్యోగుల శుభాకాంక్షలు

డీఎంహెచ్‌వోగా బాలమురళీ బాధ్యతల స్వీకరణ

అరసవల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా డాక్టర్ టి.వి.బాలమురళీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కర్నూలు జిల్లా బడినేహల్ పీహెచ్‌సీలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేసి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతవరకు పనిచేసిన డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి విశాఖ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌కు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

కొయ్య బొమ్మ.. కదిలిందమ్మా!

- చినబరంపురం బొమ్మలకు గుర్తింపు
- తొలిసారి ప్రదర్శనకు అవకాశం

6 లో

మీలో ఓ సైనికుడు

- సైనిక పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

6 లో

విధుల్లో అలసత్వం వద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరిక

7 లో


గుర్రపు స్వారీ చేస్తున్న విద్యార్థినులు

మీలో ఓ సైనికుడు

- సైనిక పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 13 వరకు గడువు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో అర్హత పరీక్ష
- ఎన్‌డీఏ లక్ష్యంగా శిక్షణ, బోధన
- త్రివిధ దళాల్లో చేరేందుకు అవకాశం

రక్షణ రంగంలో ఉన్నత స్థానంలో సేవలందించాలని ఉందా?... ధైర్య సాహసాలు గల వ్యక్తిగా మిమ్మల్ని మీరు ఆవిష్కరించుకోవాలని అనుకుంటున్నారా? అయితే మీకోసం సైనిక పాఠశాలలు ఎదురు చూస్తున్నాయి. మీ శక్తియుక్తులకు పదును పెట్టి... మీ ఆశయాన్ని నెరవేర్చేందుకు బాటలు వేయనున్నాయి.

విజయనగరం టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి):

దేశ రక్షణ రంగంలో చేరి మాతృభూమి రక్షణకు కృషి చేద్దామనుకునే విద్యార్థులకు సువర్ణావకాశం. ఆరో తరగతి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన.. ప్రత్యేక శిక్షణతో త్రివిధ దళాల్లో భాగస్వామ్య మయ్యేందుకు చక్కని అవకాశం కల్పిస్తున్నాయి సైనిక పాఠశాలలు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సైనిక పాఠశా లల్లో ప్రవేశాలకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 - 26 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో బాలబాలికలు ప్రవేశాలు పొందడానికి పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి ఫిబ్రవరి 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులు కావలసి ఉంటుంది. అక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోవడానికి అవకాశం లభిస్తుంది.

● మన రాష్ట్రంలో రెండు...

దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో 33 సైనిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మన రాష్ట్రంలో రెండు ఉన్నాయి. అందులో విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక పాఠశాల ఒకటి కాగా, చిత్తూరు జిల్లా కలికిరిలో మరో సైనిక పాఠశాల ఉంది.

● అర్హతలు ఇవీ..

సైనిక పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల వయసు 2025 మార్చి 31 నాటికి 10-12 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివి ఉండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు 2025 మార్చి 31 నాటికి 13-15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదివి ఉండాలి.

● దరఖాస్తు ఇలా..


విద్యార్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎఐఎస్ఎస్ఇఇ.ఎన్‌టీఏ.ఎన్ఐసి.ఐఎన్.వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ధ్రువపత్రాలు, విద్యార్థి ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలి. జనరల్, రక్షణ రంగంలో పని చేస్తున్న వారి పిల్లలకు, మాజీ సైనికోద్యోగుల పిల్లలకు ఫీజును రూ.800, ఎస్సీ, ఎస్టీలకు రూ.650గా నిర్ణయించారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేయాలి. 14న రాత్రి 11.30 గంటలలోగా ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా ఫీజు చెల్లించాలి.

● ఎన్ని మార్కులకు అంటే...

6వ తరగతి వారికి 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. లాంగ్వేజీ, ఇంటెలిజెన్స్, జనరల్ నాలెడ్జ్‌లో 25 ప్రశ్నల చొప్పున ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కులు ఉంటాయి. గణితంలో 50 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయి. వీరికి అన్ని ప్రాంతీయ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. 9వ తరగతి వారికి 400 మార్కులకు ఆంగ్లంలోనే పరీక్ష నిర్వహిస్తారు. గణితంలో 50 ప్రశ్నలకు 200 మార్కులు, ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, ఆంగ్లం, సోషల్ సైన్సు సబ్జెక్ట్‌ల్లో ఒక్కోదానికి 25 ప్రశ్నలకు 50 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహిస్తారు.

● పరీక్ష కేంద్రాలు ఇవే..

6వ తరగతి విద్యార్థులకు పరీక్షా సమయం 2.30 గంటలు. 9వ తరగతి విద్యార్థులకు 3 గంటలు ఉంటుంది. రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం వంటి ప్రధాన కేంద్రాల్లో సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్ష ఫలితాలు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉంచుతారు.


గురి తప్పకూడదు: షూటింగ్‌లో శిక్షణ పొందుతూ..



కోరుకొండ సైనిక పాఠశాల ప్రధాన గేటు


విద్యార్థుల పరేడ్

ఫసల్ బీమా యోజన సాయం రూ.10వేలకు పెంపు

(ఐదో పేజీ తరువాయి)

నంబరు సాయంతో ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. ఈనెల మూడో వారం నుంచి ఈ ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రైతుసేవా కేంద్రాలకు రైతులు స్వయంగా వెళ్లి అగ్రిస్టాక్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ-కేవైసీ చేసిన అనంతరం ఎన్ని ఎకరాలు ఉంది? ఏయే పంటలు సాగు చేస్తున్నారు? వంటి సమాచారం ఇవ్వాలి. ఈ సమయంలో ఆధార్‌తో లింకైన ఫోన్ రైతు వద్ద ఉండాలి. అన్ని వివరాలు నమోదు చేసిన తరువాత ఫోన్‌కి ఓటీపీ నంబరు వస్తుంది. దీనిని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జికి చెబితే.. రైతుకు ఒక యూనిక్ ఐడీనంబరుతో గుర్తింపు కార్డు అందజేస్తారు. ఈ కార్డు పలు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, నష్ట పరిహారం పొందేందుకు దోహదపడుతుంది.

కేరళ పర్యటనకు ప్రత్యేక ప్యాకేజీ

ఆమదాలవలస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రదేశాల సందర్శనకు ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలు అందిస్తున్నట్టు ఐఆర్‌సీటీసీ టూరిజం ప్రతినిధి కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 30 వరకు ఎయిర్ ప్యాకేజీ కింద కేరళలోని కొచ్చి, డచ్ ప్యాలెస్, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, సాంటర్ క్రాస్ బాసిలిక, మున్నార్, కొమరం, అలీప్, తెక్కడి పెరియార్ వన్య ప్రాణుల అభయారణ్యం, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభ స్వామి ఆలయం తదితర ప్రదేశాలు చూడవచ్చునని తెలిపారు. ఒకరికైతే రూ.64,520, ఇద్దరికి రూ.45,670, ముగ్గురికి రూ.42,890 వంతున వసూలు చేయనున్నట్టు తెలిపారు. విశాఖపట్నంలో బయలుదేరిన నుంచి తిరిగి వచ్చేంత వరకు మొత్తం ఖర్చు ఐఆర్‌సీటీసీనే భరిస్తుందన్నారు. మేఘాలయ పర్యటనకు ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీని అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. కామాఖ్య ఆలయం, బాలాజీ, చిరపుంజి జలపాతం, ఎలిఫెంటా, లివింగ్‌రూట్, బిజి డాకి సరస్సు తదితర ప్రదేశాలు సందర్శించవచ్చునని తెలిపారు. ఈ ఏడు రోజుల టూర్‌లో ఒకరికైతే రూ.63,635, ఇద్దరికైతే 46,080, ముగ్గురికి రూ.44,205 ధరగా నిర్ణయించినట్టు తెలిపారు. వివరాల కోసం 95501 66168, 92814 95847 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.



శారీరక దారుఢ్య, పరుగు పందెం పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి మహిళా అభ్యర్థులకు పరీక్షలు

ఎచ్చెర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో ఈ నెల 3, 4 తేదీల్లో మహిళా అభ్యర్థులకు శారీరకదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో 1,175 మంది మహిళా అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరు శారీరక దారుఢ్య పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. వీరికి రెండు రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా మూడో రోజు గురువారం శారీరక దారుఢ్య పరీక్షలకు 613 మంది పురుష అభ్యర్థులకు గాను 339 మంది హాజరయ్యారు. వీరిలో 214 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ నెల 6వ తేదీ నుంచి పురుష అభ్యర్థులకు యథావిధిగా శారీరక దారుఢ్య పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా మహిళా అభ్యర్థుల ఎంపిక విధుల్లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించి.. సూచనలు ఇచ్చారు.

మాస్టార్ల సమ్మె బాట... పాఠాలు చదివేదెట్టా?

- గురుకులంలో అటకెక్కిన బోధన
- పదో తరగతి విద్యార్థుల్లో ఆందోళన


పెద్దమడిలో నిరసనలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

మెళియాపుట్టి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం పెద్దమడి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది పరీక్షల్లో గట్టెక్కేది ఎలాగో తెలియని అయోమయ పరిస్థితి ఎదురవుతోంది. ఈ పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు మొత్తం 403 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌తో కలిపి 17 మంది బోధనా సిబ్బంది ఉండేవారు. వీరిలో 11 మంది వరకు ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్నారు. ప్రస్తుతం వారు సమ్మెకు వెళ్లడంతో ప్రిన్సిపాల్‌తో పాటు ఆరుగురు బోధన సిబ్బంది మిగిలారు. వారితో పాటు కొంతమంది బోధనేతర సిబ్బంది పాఠాలు చెప్పాల్సి వస్తోంది. వారు సరిగా బోధించలేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. మరోవైపు పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఏం చేయాలో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. బోధనా సిబ్బందిని నియమించాలని కోరుతూ ఇప్పటికే పాఠశాల వద్ద విద్యార్థులతో కలసి తల్లిండ్రులు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే.

వేతనాలు పెంచాలని...

వైసీపీ పాలనలో ఉద్యోగులకు ఇచ్చిన ఫిట్‌మెంట్‌ను గురుకులాల బోధనా సిబ్బందికి వర్తింపజేయలేదు. దీంతో వీరికి బోధనేతర సిబ్బంది కంటే తక్కువగా వేతనాలు వస్తున్నాయి. ప్రస్తుతం వారికి కేవలం రూ.14,300 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారు. ఎనిమిదేళ్లకు పైగా పని చేస్తున్నా ఈ మొత్తం పెంచలేదు. పైగా డీఎస్సీలో గురుకులాల్లోని పోస్టులు ఖాళీగా చూపడంతో తమ ఉద్యోగాలు పోతాయనే భయంతో వీరంతా నవంబరు 14 నుంచి సమ్మె బాట పట్టారు. వీరు తరగతులకు రాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం వీరితో సమ్మె విరమింపజేసి... బోధన సరిగా సాగేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థిదే తరగతి పర్యవేక్షణ బాధ్యత

కొయ్య బొమ్మ.. కదిలిందమ్మా!

- చినబరంపురం బొమ్మలకు గుర్తింపు
- మహిళల చేతిలో రూపుదిద్దుకుంటున్న వైనం
- తొలిసారి ప్రదర్శనకు అవకాశం
- కళాకారుల్లో సంతోషం


● మందస మండలం చినబరంపురం గ్రామానికి చెందిన శ్రీదుర్గా డ్వాక్రా సంఘానికి చెందిన ఈమె పేరు శ్రీమతి. నలభై ఏళ్లగా భర్తతో కలసి కొయ్య బొమ్మలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతోంది. పట్టణాల్లో తిరుగుతూనో.. తిరునాళ్లలోనో విక్రయిస్తుంటానని చెబుతోంది.


● మందస మండలం చినబరంపురం గ్రామానికి చెందిన జగన్నాథ డ్వాక్రా సంఘానికి చెందిన ఈమె పేరు గాయత్రి పాత్రో. తల్లిదండ్రులు, భర్త తయారు చేస్తున్న బొమ్మలను విక్రయిస్తుంటుంది. సుమారు 30 రకాల బొమ్మలను వివిధ ప్రాంతాల్లోను, జాతరల్లోనూ అమ్ముతూ జీవనం సాగిస్తోంది. తమ బొమ్మలను విక్రయించేందుకు సరైన వేదిక ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతోంది.


డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు

హరిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):

కొయ్య బొమ్మలు అంటే ఠక్కున గుర్తుకొచ్చేది ఏటికొప్పాక బొమ్మలు. వాటిని మించిన స్థాయిలో... ఏళ్లుగా తయారు చేస్తున్నా.. సరైన ప్రోత్సాహం కరువై పరిసర గ్రామాలకే పరిమితమైన కొయ్య బొమ్మలు మన జిల్లాలో ఉన్నాయి. అవే మందస మండలం చినబరంపురం కొయ్య బొమ్మలు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్ర స్థాయిలో ఖ్యాతి పొందేందుకు అవకాశం లభించింది. జిల్లా, రాష్ట్ర స్థాయి డ్వాక్రా మహిళల ఎగ్జిబిషన్‌లో వీటి ప్రదర్శనకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక స్టాల్..

జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే డీఆర్‌డీఏ ఎగ్జిబిషన్‌లో తొలి సారి చినబరంపురం కొయ్యబొమ్మలకు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటుకు వెలుగు అధికారులు రంగం సిద్ధం చేశారు. దీనికిగాను శ్రీ జగన్నాథ, శ్రీ దుర్గా డ్వాక్రా గ్రూపులకు చెందిన నలుగురు మహిళలను ఎంపిక చేశారు. శ్రీమతి వడ్రంగి, కుమారి పాత్రో, భాగ్యలక్ష్మి పాత్రో, గాయత్రి పాత్రోలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొననున్నారు. దీంతో పాటు జిల్లాలో విజయవంతమైతే రాష్ట్ర స్థాయిలో ఏటికొప్పాక బొమ్మలకు దీటుగా వీటిని విస్తరించేలా చర్యలు చేపడుతున్నారు.

ఈ బొమ్మలు ప్రత్యేకం..

మహిళల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న బొమ్మలు ఇంటిలో ఉపయోగించేవే ఎక్కువగా ఉంటున్నాయి. దువ్వెనలు, గరిటెలు, భరిణెలు, సోలలు, తూములు, అడ్డల వంటి కొలత పాత్రలతో పాటు ఏనుగులు, పక్షులు, చిలుకలు, పూవులు, పీటలు, సైకిళ్లు, వివిధ రకాల అలంకరణ వస్తువులు సుమారు 55 రకాలు ప్రదర్శనకు సిద్ధం చేస్తున్నారు. కొయ్య బొమ్మలు తయారు చేసేందుకు ప్రధానంగా మహేంద్ర గిరుల్లో విరివిగా లభించే అంకుడు, ఇరిడి, పాపిడి, గుమ్మడి కర్రలను వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతంలోని గిరిజనుల వద్ద వీటిని కొనుగోలు చేసి తయారీకి వినియోగిస్తున్నారు.

రంగులు లేక ఇక్కట్లు..

కొయ్యబొమ్మలకు రంగులద్ది ప్రదర్శనకు ఉంచితే కనువిందు చేస్తాయి. రంగుల ధరలు పెరగడంతో గత కొన్నేళ్లుగా వాటిని కొనడం లేదు. దీంతో కొనుగోళ్లు కాస్తా తగ్గాయి. ప్రభుత్వం ఆదుకొని రాయితీపై రంగులు, రుణాలు అందజేస్తే బొమ్మలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయని కళాకారులు చెబుతున్నారు.

రుణ సౌకర్యం కల్పించి ప్రోత్సాహం..



మహిళలు రూపొందించే బొమ్మల విశిష్టతను... నాణ్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. వీరిని ప్రోత్సహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో వీటిని పరిశ్రమలా ప్రోత్సహించి... రుణ సౌకర్యం కల్పించి... యంత్రాలు ఏర్పాటు చేయిస్తాం. బొమ్మల అలంకరణకు రంగులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటాం. దీనిని మధ్యతరహా పరిశ్రమగా అభివృద్ధి చేసి.. వారికి పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించి... ఆదుకునే ఏర్పాట్లు చేస్తున్నాం.

-పైడి కూర్మారావు, ఏపీఎం, మందస

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ మెట్టక్కివలస టౌన్-2 ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడం కారణంగా ఈ నెల 3వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెట్టక్కివలస అమ్మానగర్, కుప్పిలివారివీధి, ఊసవానిపేట, అలమాజీపేట వాటర్ పంపు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ అంతరాయన్ని గమనించాలన్నారు.

● ఎచ్చెర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు, ఇతర మరమ్మతుల కోసం ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో కొన్ని గ్రామాలకు శుక్రవారం సరఫరాలో అంతరాయం నిలిపివేస్తున్నామని ఈఈ పి.యోగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫరీద్‌పేట ఫీడర్, 11 కేవీ కేశవరావుపేట, లింగాలపేట, ఎస్ఎం పురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఎస్పీ 'మీ కోసం' రద్దు

శ్రీకాకుళం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఏఆర్ పోలీసు మైదానంలో కానిస్టేబుల్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 3న శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక మీకోసం రద్దు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. తిరిగి వచ్చే వారం నుంచి యథావిధిగా ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్డీవో కె.సాయి ప్రత్యూష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పాసై, నిరుద్యోగిగా ఉన్న ఎస్‌హెచ్‌జీ మహిళలు, సహకార సంఘాలు, గిరిజన సహకార సంఘాలు చెందిన వారిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులన్నారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, రాతపరీక్ష ఫిబ్రవరి 5న ఉంటుందన్నారు. దరఖాస్తును గజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి, రూ.600 డీడీ, మూడు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు జతచేసి కవర్‌పై డిపో డీలరు నియామకానికి అని రాసి ఆర్డీవో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణకు..

ఎచ్చెర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ నైపుణ్య శిక్షణా కేంద్రం (మహిళా ప్రాంగణం)లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మేనేజర్ పి.విమల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులు కావాలని, టైలరింగ్‌లో విద్యార్హతలు 8వ తరగతి చదవాలన్నారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు వయసు గల మహిళలు అర్హులని, ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9948530183, 7416764419 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కమిటీలతోనే పాఠశాలలు బలోపేతం

కవిటి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు యాజమాన్య కమిటీలతోనే బలోపేతం కానున్నాయని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్స్, హెచ్ఎంల శిక్షణలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలకు కావల్సిన వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులు మాత్రమే గుర్తించగలరన్నారు. కూటమి ప్రభుత్వం తల్లిదండ్రుల కమిటీలకే ఎంపిక చేసి వారిద్వారా పాఠశాలలు బలోపేతం చేయాలని సంకల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ధనుంజయ మజ్జి, చిట్టిబాబు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రేపు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

సోంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): త్యాగరాజుస్వామి 176వ ఆరాధనోత్సవాలు స్థానిక సంస్కారభారతి సంస్థల ప్రాంగణంలో శనివారం నిర్వహిస్తున్నట్టు వుట్ల మీనకేతనరావు, నిమ్మన దాసు, బొంతల కృష్ణారావు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి ప్రముఖ కళాకారులతో సంగీత విభావరి, అనంతరం మృదంగంలో 75 ఏళ్లు పూర్తిచేసుకున్న యల్లా వెంకటేశ్వరరావు, వారి బృందానికి సన్మాన కార్యక్రమం, 3గంటల నుంచి ఆయనచే సంగీత కచేరీ ఉంటుందని తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం

గార, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బూరవెల్లి గ్రామానికి చెందిన ఐదేళ్ల వయసు గల డిక్కల శశాంక్ కిడ్నీ, పేగుకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాడు. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో లబోదిబోమంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బోరవానిపేట శ్రీ సత్యసాయి భజన మండలి తరుపున రూ.30 వేలు, 1996-97లో గార జడ్పీ హైస్కూల్ పదో తరగతి చదువు కున్న విద్యార్థులు రూ.20 వేలు చొప్పున గురువారం ఆ బాలుడి కుటుంబ సభ్యులకు అందించారు.

గ్రామసభలే కీలకం

పొందూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అభివృద్ధి పనులకు గ్రామసభలే కీలకమని మేజర్ పంచాయతీ ఈవో మోహన్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ పార్కులో గురువారం మేజర్ పంచాయతీలో చేపట్టనున్న అభివృద్ధి పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఉప సర్పంచ్ ఎ.గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలి

పొందూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక అక్షరాస్యత అలవరచుకోవడంతోపాటు బ్యాంకింగ్ వ్యవస్థ, డిపాజిట్ ఖాతాలపై తెలుసుకోవాలని లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ కె.ఉమాశంకర్ అన్నారు. బి.కంచరాం గ్రామంలో గురువారం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలుపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ సూచించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, రిసోర్స్‌పర్సన్లు ఎస్.హరి, హరనాథ, లక్ష్మణరావు, జి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం విజయవంతం చేయండి

రణస్థలం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. గురువారం కోస్టు స్కూల్లో దీనికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు, ఏపీయూఎస్ మండల అధ్యక్షుడు జి.చిన్నికృష్ణంనాయుడు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలిరావాలని ఇచ్ఛాపురం విశ్వహిందూ పరిషత్ సభ్యులు గురువారం పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు తరలివచ్చేవారి కోసం ప్రత్యేకంగా రైలు సదుపాయం కల్పిస్తున్నామని, 4వ తేదీ శనివారం సాయంత్రం 6.30గంటలకు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్దకు చేరుకోవాలని సభ్యులు తెలిపారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఆమదాలవలస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్లు అందరూ ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లు పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలోగాని, నెట్ సెంటర్ ద్వారా గాని వచ్చే నెల 28వ తేదీలోగా సమర్పించాలన్నారు. సబ్ ట్రెజరీ కార్యాలయం కింద గదిలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

● క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
● ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా సీడీపీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధికారులతో ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో పాలు, గుడ్లు పంపిణీ జరగాలని, ముఖ్యంగా గర్భిణులు, పిల్లల్లో పోషకాహార లోపం రాకుండా చూడాలని, తాగునీటి సౌకర్యం, నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయితీరాజ్ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేసారు. క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేయాలని, ఈ విషయంలో వెనుకబడ్డ సీడీపీవోలు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టడానికి గ్రామస్థాయి, మండల స్థాయిల్లో నిర్వహించబోయే సమావేశాలు, అవగాహనా కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేసి అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన సాక్షం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతలు, ఇతర సామగ్రి పంపిణీ పనులు వెంటనే పూర్తి చేయాలి, ప్రతీ రోజు సీడీపీవో, సూపర్‌వైజర్లు క్రమం తప్పకుండా ఆయా కేంద్రాలను పర్యవేక్షించి, నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐసీడీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది అంకితభావం, చిత్తశుద్ధితో సేవలందించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీహెచ్‌ఆర్ శతశాతం లబ్ధిదారునికి అందేలా చూడాలని, మాతా, శిశు మరణాల నియంత్రణ దిశగా పనిచేయాలని స్పష్టం చేశారు.

ఇంటి పండగలా 'రథసప్తమి' నిర్వహిద్దాం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
● ప్రజల నుంచి సూచనలు, సలహాల స్వీకరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యానారాయణ స్వామి రథసప్తమి వేడుకలను ప్రజలందరూ తమ ఇంటి పండగలా నిర్వహిద్దామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో కలిసి రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ కార్య క్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో జరిగే ఈ వేడుకలు 2వ తేదీన శోభాయాత్రతో ప్రారంభమవుతాయని, అదే రోజు సాయంత్రం అరసవల్లి గొప్పదనాన్ని చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబేంచేలా ప్రదర్శన ఉంటుందన్నారు. 2, 3 తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణ, 3న సౌరయాగం జరుగుతుం దన్నారు. లేజర్ షో ద్వారా జిల్లా ప్రాశస్త్యం, చరిత్ర తెలిసేలా కార్యక్రమం ఉంటుందన్నారు. టూరిజం హెలీ కాప్టర్ ద్వారా నగర సందర్శన ఉంటుందన్నారు. ఈ మూడు రోజులూ కార్యాలయాలను, ఇళ్లను విద్యుద్దీపాలతో అలంకరించుకోవాలని పిలుపునిచ్చారు. ఫ్రీ పాసు లు అనేవి ఉండవని, అన్ని పాసులపై క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ప్రపంచం మనవైపు చూసేలా వేడుకలు నిర్వహించడానికి అందరి సహకారం అవసరమన్నారు. అలాగే రథసప్తమి రోజున స్కూల్స్, కళాశాలలకు సెలవు ప్రకటించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు చేసిన సూచనలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో వై.భద్రాజీ, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహాన్ని నింపేవి క్రీడలు


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న విప్ అశోక్

కవిటి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేవి క్రీడలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి జోనల్ గ్రిగ్స్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ మురళీమోహనరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, ఎస్.రామకృష్ణ, పాఠశాల చైర్మన్ టి.మోహనరావు, టీడీపీ నాయకులు బి.రమేష్, ఎ.మధు, మణిచంద్రప్రకాష్, సర్పంచ్ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

5న ఆత్మీయ అభినందన సభ

శ్రీకాకుళం క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన గూడ్స్ సర్వీస్ ట్యాక్స్‌అధికారి చౌదరి పురుషోత్తం నాయుడు పదవీ విరమణ చేశారని ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఎన్జీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న బృందావన్ ఫంక్షన్‌హాల్‌లో ఉద్యోగ సంఘ నాయకులతో కలసి ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పెద్ద మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ సీజ్


స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్

శ్రీకాకుళం అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి వర్తకులు సహకరించాలని కోరుతున్నా విచ్చలవిడిగా పొట్టి శ్రీరాములు (పెద్ద)మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడంతో గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద మార్కెట్‌లోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు 400 కిలోలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. మరోసారి పట్టుబడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రికెట్ టోర్నీ రన్నర్‌గా ఇచ్ఛాపురం జట్టు


రన్నర్ ట్రోఫీతో ఇచ్ఛాపురం జట్టు

ఇచ్ఛాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు జెన్‌ఆర్ క్రికెట్ అకాడమీలో గత పది రోజులుగా జరుగుతున్న అండర్-15 క్రికెట్ టోర్నీ రన్నర్‌గా ఇచ్ఛాపురం ఐసీసీ జట్టు నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇచ్ఛాపురం ఐసీసీ జట్టు హైదరాబాదు స్ట్రెయింట్ డ్రైవ్ క్రికెట్ జట్టుతో తలపడింది. ఐసీపీ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 136 పరుగులు చేసి 9వికెట్టు కోల్పోయింది. అనంతరం 137 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

బ్యాడ్మింటన్ అంపైర్‌గా సాయినాథ్



శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు అంపైర్‌గా సంపతిరావు మోహన్ సాయినాథ్ ఎంపికైనట్టు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపైర్‌గా సాయినాథ్ వ్యవహరించనున్నారు. ఈ నియామకంపై జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ తదితరులు అభినందనలు తెఇపారు.

ఫిబ్రవరి 7 నుంచి కమ్మసిగడాం జాతర


జాతర ఏర్పాట్లుపై కమిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు కమ్మసిగడాం మహాలక్ష్మి జాతర ఫిబ్రవరి 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మూడు రోజుల పాటు భక్తుల వినోదం కోసం ఏర్పాటు చేసే సాంస్కృతి అంశాలపై చర్చించారు. అనంతరం రామతీర్థం బీటీ రోడ్డు ఆనుకుని అమ్మవారి ఆలయం వరకూ సీసీ రోడ్డు పనుల కోసం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.రాజరవిచంద్ర, వి.తేజ, వి.రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వి.మరళీ, వి.సురేష్‌కుమార్, మన్నె కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితోనే లక్ష్యసాధన



ఎచ్చెర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుంటే సునాయాసంగా లక్ష్యాన్ని సాధించగలరని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో గురువారం ప్రాంతీయ స్థాయి అంతర పాలిటెక్నిక్ స్పోర్ట్స్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలుర విభాగంలో ఓవరలాల్ చాంపియన్ షిప్ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల (ఎచ్చెర్ల), బాలికల విభాగంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ (శ్రీకాకుళం) క్రీడాకారులు సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎంపీఐ పీవీ గంగాధరరావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విక్టర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు జోస్మిత్



శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు తుంగాన జోస్మిత్ ఎంపికైనట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ స్పష్టం చేశారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రికెట్ పోటీల్లో స్థానిక ఆర్‌సీఎంలో చదువుతున్న జోస్మిత్ సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైట్టు తెలిపారు.

యువతకు 'సెంచూరియన్' ఉపాధి


మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు డీఎన్ రావు

నెల్లిమర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో త్వరలో ఎగుమతి ఆధారిత యూనిట్ నెలకొల్పనున్నట్టు ఆ సంస్థ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎగుమతి ఆధారిత యూనిట్ నెలకొల్పిన ఏకైక వర్సిటీ తమదేనన్నారు. ఇక్కడ నుంచి ఆస్ట్రేలియా, ఇతర దేశాలకు ఎగుమతులు చేపడతామన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఒకరు వ్యవస్థాపకుడిగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. ఇందులో భాగంగా ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేష్ సమక్షంలో సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్)తో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ప్రస్తుతం సెంచూరియన్‌లో డ్రోన్‌ల తయారీ, డ్రోన్‌ల పరిశోధన, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్లు నెలకొల్పామన్నారు. సమావేశంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, డాక్టర్ పల్లవి, పద్మ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన 'కూన'

ఆమదాలవలస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ విజయవాడలోని వెలగపూడి సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ గ్రామ, వార్డు ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్‌ను సీఎస్‌చే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌అబ్దుల్ రజాక్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, కృష్ణ జిల్లా అధ్యక్షుడు నవీన్, సంఘ ముఖ్య నాయకులు గోపీనాథ్, మురళీ, ఇమ్రాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాము ప్రమాణం


డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాము

రణస్థలం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడ బీసీ భవనం గొల్లపూడి రాష్ట్ర కార్యాలయలో గురువారం గరజా పు రాము ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్సీ గల్లా మాధవి, రజక కార్పొ రేషన్ చైర్మన్ సి.సావిత్రి ఆధ్వర్యంలో ఈ కార్య క్రం జరిగింది. మొత్తం 15 మంది డైరెక్టర్లు పాల్గొ న్నారు. కార్యక్రమంలో డి.శంకర్, సోపేటి రామారావు, జొన్నాడ భాస్కర్, దమరసింగ్ మహాలక్ష్మి, శంకర్, కొండబాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యం

ఆమదాలవలస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షకే అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు అన్నారు. గురువారం సిక్కోలు చేయూత సంఘం అధ్యక్షుడు వడ్డాది గోపి ఆధ్వర్యంలో గ్రీన్‌ట్రీ సంస్థ అధ్య క్షుడు తంగి శంకర్ పట్టణంలోని పాలపోలమ్మ గుడి కమిటీ సభ్యులకు 20 మొక్కలను అందించారు అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు పాతిన రమణమూర్తి, శిల్లా గురునాథరావు, గ్రీన్ ట్రీ సంస్థ సభ్యులు అన్నెపు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

మద్యం అక్రమ రవాణాపై నిఘా

● ఎక్సైజ్ సీఐ అనురాధదేవి



రణస్థలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేకంగా నిఘా పెట్టినట్టు రణస్థలం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అనురాధదేవి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. గ్రామాల్లో ఎక్కడా బెల్టు షాపులు లేకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

ప్రశ్న: జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమంగా మద్యం తరలించకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: సరిహద్దు ప్రాంతం కావడంతో నిఘా పెట్టాం. చెక్ పోస్టులు సైతం ఏర్పాటు చేశాం. అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేశాం.

ప్ర: గత రెండు నెలల్లో ఎన్ని కేసులు నమోదు చేశారు?

జ: రణస్థలం ఎక్సైజ్ పరిధిలో రణస్థలం, లావేరు మండలాలు ఉన్నాయి. రణస్థలంలో 10 షాపులు, లావేరు మండలంలో ఐదు షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో పక్కాగా నిబంధనలు అమలయ్యేలా చూస్తున్నాం. నవంబరులో 22 కేసులు నమోదు చేశాం. 283 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నాం. డిసెంబరులో 19 కేసులు నమోదు చేసి.. 193 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నాం.

ప్ర: అవగాహన సదస్సుల మాటేంటి?

జ: మళ్లీ నవశకం కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 10 గ్రామాల్లో ఇప్పటివరకూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించాం. ప్రభుత్వం అప్పగించిన విధులతో పాటు ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నాం.

ప్ర: బెల్ట్ షాపుల నిర్వహణను ఎలా అరికడతారు?

జ: గతంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్న గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాం. 91 మందిని బైండోవర్ చేశాం. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించాం. ఇప్పటికి లోక్ అదాలత్‌లో 131 కేసులు సెటిల్ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

గార, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. గురువారం రాత్రి చింతువలస గ్రామంలో నిర్వహించిన సంకల్పంలో ఆయన పాల్గొని మాటగ్లాడారు. ఏటీఎం మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. స్థానిక పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బొడ్డేపల్లిపేట, ఆమదాలవలస గేటులో పలు కుటుంబాలను గురువారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. ఇటీవల బొడ్డేపల్లిపేటలో బెండి వీరభద్రరావు తల్లి, ఆమదావలస గేటు వార్డు చెందిన జల్లేపల్లి రామారావు తల్లి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను మాజీ స్పీకర్ పరామర్శించారు.

తాగునీటి మోటార్ ఏర్పాటు

పొందూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పైడికొండ సమీపంలో హౌసింగ్ కాలనీకి గురువారం మోటార్‌తోపాటు పైపులైన్లు ఏర్పాటుచేశారు. కాలనీ ఏర్పాటైనా తాగునీటి ఇబ్బందులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి కాలనీవాసులు తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ నిధులతో మోటార్ ఏర్పాటుతో పాటు తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. పనులను టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఈవో మోహన్‌బాబు పరిశీలించారు.

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

సోంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జనవరి 28,29 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన చాతన్ విరాట్ బంగారు, బి.సిరివర్షిణి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరికి పలువురు అభినందించారు.

పాఠశాలల అభివృద్ధికి చర్యలు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


శ్లాబ్ నిర్మాణానికి పూజ చేస్తున్న గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. అక్కుపల్లి పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు పాఠశాల భవనాల శ్లాబ్ పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు ఎం.వరప్రసాదరావు వైసీపీ హయాంలో మంజూరైన నాడు-నేడు పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరారు. దీంతో శిరీష మాట్లాడుతూ అవకతవకలపై లిఖితపూర్వక ఫిర్యాదు అందిస్తే నెల రోజుల్లో విచారణ చేపట్టి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూటమిప్రభుత్వం పాలనలో అవినీతికి ఎక్కడా ఆస్కారం లేదని చెప్పారు. సమావేశంలో హెచ్ఎం జనార్దన, మాజీ ఎంపీపీ సూరాడ భారతి, మాజీ సర్పంచ్‌లు లండ రామలింగం, ఎం.శాంతమూర్తి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి రహదారి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంజీఆర్

మెళియాపుట్టి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం కరజాడ నుంచి టకోయి గ్రామానికి రహదారి పనులకు భూమి పూజచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో విధ్వంసం తప్పా అభివృద్ధి కనిపించలేదన్నారు. చంద్రబాబునాయుడు ముందు చూపు ఉన్న ముఖ్యమంత్రి కావడం ప్రజలు అదృష్టమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు టకోయి గ్రా మానికి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రూ.రెండు కోట్లతో పనులు చేపడుతుండడంతో సజావుగా పలాస మండలానికి వెళ్లే అవకావశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, భాస్కర్‌గౌడో, అనపాన రాజశేఖరెడ్డి, పీఆర్‌డీఈ శివప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి


వరహాలమ్మ (ఫైల్)

ఎచ్చెర్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కుశాలపురం గ్రామానికి చెందిన పైడి వరహాలమ్మ(67) ఇంటికి సమీపంలోని వ్యవసాయ బావిలో పడి మృతిచెందింది. ఎస్ఐ వి.సందీప్ కుమార్ కథనం మేరకు.. వరహాలమ్మ ఒంటరిగానే ఓ ఇంట్లో నివాసం ఉంటుంది. బుధవారం రాత్రి సమయంలో ఈ ఘటన జరిగిందని, గురువారం ఉదయం గ్రామస్థులు బావిలో పడిన వరహాలమ్మను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వరహాలమ్మ మెడలో ఉన్న బంగారు తాడు కన్పించలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. వరహాలమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పైడిభీమవరంలో లారీ క్లీనర్..

రణస్థలం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారి పైడిభీమవరంలో గల ఒక దాబా వద్ద గురువారం తెల్లవారు జామున జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ జుబీరు అన్‌చారీ (23) గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు జంషెడ్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న లారీలో క్లీనర్‌గా జుబీరు అన్‌చారీ పనిచేస్తున్నాడు. తెల్లవారి జామున పైడిభీమవరంలో ఒక దాబా వద్ద టీ తాగడానికి లారీని నిలుపుదల చేశారు. టీ తాగిన అనంతరం లారీ ఎక్కిన క్లీనర్ జుబీర్ అన్‌చారీ ఒక్కసారిగా కూలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

25 మద్యం సీసాల స్వాధీనం

ఇచ్ఛాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేశామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈదుపురం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ద్విచక్రవాహనంపై 25 మద్యం సీసాలతో వస్తుండగా పట్టుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేశామన్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

టెక్కలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని పాతజాతీయరహదారి పెద్ద బ్రాహ్మణవీధి జంక్షన్ సమీపంలో దేవాది చిరంజీవికి చెందిన దుకాణంలో గురువారం రాత్రి అగ్నిమంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఈలోగా ఎలక్ట్రికల్ సామగ్రి, ఇతర రూ.70వేలు విలువ గల సామగ్రి మంటల్లో కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు.

ఇంటి పునాది తొలగింపునకు చర్యలు

కోటబొమ్మాళి, జనవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యలమంచిలి పంచాయతీ మామిడివానిపేట గ్రామానికి చెందిన ఇరఘట్టపు రజని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన పునాదిని గురువారం రెవెన్యూ అధికారులు తొలగింపునకు చర్యలు చేపట్టారు. గతప్రభుత్వం సర్వేనెంబరు 60లో జగనన్న కాలనీ కోసం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఈనేపథ్యంలో అధికారులు రజనికి పట్టా అందజేశారు.అయితే స్థలం కేటాయించపోగా రజనిబ్లాక్ 7లో 43లో ఇల్లు నిర్మాణం కోసం పునాది వేసుకుంది. తాజాగా దీనిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు కాలనీ జాబితాలో రజిని పేరు లేకపోవడంతో అ నిర్మాణాన్ని తొలగించేందు సిద్ధమయ్యారు. ఇంతలో గ్రామస్థులు అడ్డుకోవడంతో అక్కడ నుంచి రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు. ఈవిషయంపై ఆర్ఐ పవిత్రకు వివరణ కోరగా జగనన్న లేఅవుట్‌లో రజిని పేరులేదని అందుకే తొలగించాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

గ్రిగ్స్ పోటీల్లో సత్తాచాటిన జీఆర్‌పురం విద్యార్థులు

హరిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని జీఆర్‌పురం ఉన్నతపాఠశాల విద్యార్థులు జోనల్ గ్రిగ్స్‌పోటీల్లో సత్తాచాటారు. ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నట్లు హెచ్ఎం ఎస్.ఎర్రన్నాయుడు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులను పీఈటీ గీత,ఉపాధ్యాయులు నారాయణరావు, పాపారావు, మాధవ రావుతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్, 100, 200, 300 మీటర్ల పరుగు పందెంతోపాటు ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఐదు బంగారు, నాలుగు సిల్వర్, ఆరుబ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమస్థానం

కొత్తూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ఆవరణలో గతఏడాది డిసెంబరు 30న జరిగిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాతపొన్నుటూరు యూపీపాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమస్థానం సాధించింది. గైడ్ టీచర్ అందవరపు రాజేష్ నేతృత్వంలో ఎనిమిదో తరగతి బాలికలు పతివాడ హరిణి, సవిరిగాన శ్రావ్య, అంధవరపు హిమబిందు మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో బయోగ్యాస్ ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ మేరకు పాత పొన్నుటూరు యూపీ పాఠశాలలో హెచ్ఎంలు గుర్రాల కృష్ణారావు, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పారిశెల్లి రామరాజు గురువారం విద్యార్థినులకు అభినందించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలి



రాస్తారోకో చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కొత్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నివగాం ఆర్టీసీ కాంప్లెక్స్ లీజును రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నివగాంలో రాస్తారోకో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిర్ల ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులను ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోకుండా లీజుకు ఇవ్వడం సరికాదన్నారు.ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండే కాంప్లెక్స్‌ను పదేళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి చూడడం సమంజసం కాదన్నారు.

మైక్రోఫైనాన్స్ వలలో పడొద్దు: ఏపీఎం

హరిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు మైక్రోఫైనాన్స్ సంస్థల వలలో పడొద్దని ఏపీఎం పైడి కూర్మారావు కోరారు.గురువారం మందస మండలంలోని కొండలోగాం, కుసుమల గిరిజన పంచాయతీల్లో డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణాలతోపాటు, మార్కెటింగ్ కోసం ప్రత్యేక మాల్స్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మైక్రోఫైనాన్స్ పేరుతో కొన్ని సంస్థలు మహిళలకు ఆశచూపి దోచుకుంటాయని వివరించారు. రుణాల అవసరమైన మహిళలు వెలుగుకార్యాలయానికి సంప్రదించి వ్యాపారాభివృద్ధి చేపట్టి ఆర్థికభరోసా పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాజారావు, సీవో స్వామి నాయుడు, వీవోఏలు జగబందు, ఆనంద్ పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ ఏఈ బదిలీ

టెక్కలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఈపీడీసీఎల్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న తమ్మినేని ఈశ్వరరావు శ్రీకాకుళం ఎలక్ట్రికల్ విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజిలెన్స్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న డి.మురళీమోహనరావు బాధ్యతలు చేపట్టనున్నారు.

అద్దెకు ఫుట్‌పాత్‌లు.. ప్రజలకు అగచాట్లు

● దోచుకుంటున్న వ్యాపారులు ● ఇదీ నరసన్నపేటలో పరిస్థితి

నరసన్నపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో ఫుట్‌పాత్‌లు కొందరికి కాసులు కురిపిస్తున్నాయి. సంక్రాంతి సీజన్‌లో ఇక్కడ ఫుట్‌పాత్‌లపై దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు ఏటా కోట్ల రూపాయలు క్రయవిక్రయాలు చేస్తారు. తాత్కాలికంగా సంక్రాంతి ముందు రెండు నెలలు టెంట్లు ఏర్పాటు చేసి దుస్తులతోపాటు పలు సరకులు విక్రయిస్తారు. రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే చిరువ్యాపారుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు స్థానిక వ్యాపారులు డ్రైనేజీలు, ఆర్‌అండ్‌బీ రహదారులకు ఆనకుని ఉన్న స్థలాలు వేలాది రూపాయల అద్దెకు ఇస్తున్నారు. ఆయా స్థలాలు గతంలో ఖాళీగా ఉండడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యేదికాదు. రోడ్డు పక్కన గల ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేపడుతుండడంతో ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు, విద్యార్థులు అగచాట్లకు గురవుతున్నారు. ప్రధానంగా నరసన్నపేట ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. ఒడిశాతోపాటు జిల్లాలో పలు ప్రాంతాలకు కూడలిగా ఉండడంతో రద్దీగా ఉంటోంది. అలాగే ప్రతిరోజూ కోట్లాది రూపాయలు వ్యాపారలావేదేవీలు జరుగుతున్నాయి. దీనికి తోడు పోలాకి, జలుమూరు, సారవకోట, సంతకవిటి తదితర మండలాల ప్రజలు ప్రతి పనికి ఇక్కడకే వస్తారు. దీంతో నరసన్నపేటలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు పలు కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. ఈ తరుణంలో ఫుట్‌పాత్‌లు అద్దెకు ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

ఏటా సంక్రాంతి ముందు

పట్టణంలో మసీదు నుంచి పైడితల్లి జంక్షన్ వరకు ఆర్‌అండ్‌బీ రహదారులు, పంచాయతీకి సంబంధించిన డ్రైనేజీలకు ఆనుకుని ఉండే ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటుచేసే వారి నుంచి కొందరు సంక్రాంతి ముందు రెండు నెలలు వేలాది రూపాయలను వసూళ్లు చేస్తున్నారు. కంబకాయి జంక్షన్ నుంచి కాలేజీ రోడ్డు జంక్షన్ వరకు డ్రైనేజీలపై షాపులు ఏర్పాటుకు ఒక్కోవ్యాపారి నుంచి రూ.15 నుంచి రూ.20 వేల వరకు ధర నిర్ణయించి అద్దెకు ఇస్తున్నారు. ఓ ఆయిల్ బంకు ముందు భాగంలో ఆర్ అండ్‌బీ స్థలంలో సంబంధిత యాజమాని షాపులు వేసేందుకు వేలాది రూపాయిలు వసూళ్లు చేయడంపై ఆరోపణలొస్తున్నాయి. పట్టణంలో సంక్రాంతి సీజన్‌లో వచ్చే ఫుట్‌పాత్ వ్యాపారులు నుంచి లక్షలాది రూపాయలు వసూళ్లకు చేసి దోచుకుంటున్నా స్థానికవ్యాపారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా పోలీసులకు ఫిర్యాదు చేసి, ఫుట్‌పాత్‌లకు సంబంధించి అద్దె వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని నరసన్నపేట పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం జనవరి2 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంతోపాటు పరిసరప్రాంతాల్లోని పలుగ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయరహ దారి-326ఏ రోడ్ క్రాసింగ్(ఫ్లైఓవర్ వద్ద)వర్క్స్ నిర్వహణ పనుల దృష్ట్యా పాతపట్నం ఉప కేంద్రపరిధిలోని పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల, గోపాలపురం, సీతారాంపల్లి చంగుడి, సరాళి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

●నందిగాం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మదనాపురం, దీనబంధుపురం, హర్షబాడ, ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనుండడంతో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకుమదనాపురం, దీనబంధుపురం, అన్నాపురం, హర్షబాడ,రధజనబొడ్డపాడు, కల్లాడ, నౌగాం తదితర గ్రామాలకు సరఫరా కు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

●పోలాకి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 కేవీ పిరువాడ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా చల్లబంద, పాతూరు, కుసుమపోలవలస, గవరంపేట, ఓదిపాడు, చీడివలస, జిల్లేడువలస, మాకివలస, కోరాడలచ్చయ్యపేట, సన్యాసిరాజుపేట, వైబీవలస, రాళ్లగోదాయివలస, కొండకొత్తపేట, పిరువాడకాలనీ జడూరులో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ జి.శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు.

నేడు మండల సమావేశం

టెక్కలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి గ్రిగ్స్ పోటీలు

పోలాకి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మబగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజవర్గస్థాయి పాఠశాలల బాల, బాలికల గ్రిగ్స్ పోటీలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించనున్నట్లు పీఈటీలు తెలిపారు. గురువారం ఆటలపోటీల నిర్వహణపై పాఠశాల ప్రాంగణంలో పీఈటీలంతా సమావేశమయ్యారు. శుక్రవారం నుంచి ఏడో తేదీ వరకూ జరిగే ఈ పోటీలకు ఏర్పాట్లు చేశారు.

మినీ అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నందిగాం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పీఎం జన్మన్ పథకం కింద నూతనంగా మంజూరైన మినీ అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. కందులగూడేం,బైరిబొడ్డపాడు, సవర నీలాపురం గిరిజన గ్రామాలకు ఈ కేంద్రాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈనెల పదో తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా టెక్కలి ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందించాలని కోరారు. ఈ పోస్టులు ఎస్టీలకు కేటాయించారని, స్థానికంగా నివాసులై, ఏడో తరగతి ఉత్తీర్ణులైన వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

●పలాసరూరల్,జనవరి2(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో పీఎంజేఎన్ఎం స్కీమ్ కింద టీఎస్‌పీ ఏరియాలో మూడు అంగన్‌వాడీకేంద్రాలు మంజూరుకావడంతో, వాటిలో సహాయకుల పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీచేశారని ఐసీడీఎస్ పీవో పార్వతితెలిపారు. కొటారింగితాళభద్ర, పెద్ద పలియా,సిరిపురంల్లో సహాయకులు పోస్టులకుఎస్టీ అభ్యర్థులు శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తులను కాశీబుగ్గ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

● పాతపట్నం జనవరి2(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఐసీడీఎస్ పరిధిలో మంజూరైన పది, ఖాళీగాఉన్న ఐదు కలిపి 15 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పీవో విమలారాణి తెలిపారు. పాతపట్నం మండలంలోని కోణంగి మినీ కార్యకర్త పోస్టు బీసీ-బికి, చిన్నకింగ, కొత్త ఎస్ఎస్ మణుగు సహాయకుల పోస్టులు ఎస్టీ అభ్యర్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

రసాభాసగా చేనేత సహకార సంఘ సమావేశం


సభ్యత్వం ఇవ్వాలని కోరుతున్న చేనేత కార్మికులు

పాతపట్నం జనవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరసవాడలో పోలీసుల పహారాలో జరిగిన ఉమాశంకర్ చేనేత సహకార సంఘ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. గురువారం చేనేతశాఖ జిల్లా అభివృద్ధి అధికారి జి.శంకరరావు ఆధ్వర్యంలో కొత్తసభ్యులతో కలిపి సంఘసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా నిర్వహిస్తున్న సహకార సంఘంలో అర్హులైన వారిని సభ్యులుగా చేర్చాలని కోరగా చేర్పించినట్లు చెప్పారు. కొత్తగా చేరిన సభ్యులు మాట్లాడుతూ సంఘంలో మూడు దశాబ్దాలుగా నిర్వహించిన రికార్డుల వివరాలు, చేనేత ఉత్పత్తులు, నూలు తదితర స్టాక్ వివరాలు తెలియజేయాలని కోరారు. ఆర్థిక లావాదేవీల నిర్వహణ బ్యాంకుల్లో ఉన్ననగదు వివరాలను తెలిపాలన్నారు.కాగా ఇప్పటికే సంఘంలో ఉన్న సభ్యులు సమావేశానికి హాజరైనట్లు సంతకాలు చేసేందుకు నిరాకరించారు. దీంతో కొత్తసభ్యులు అధికారులను నిలదీశారు.

యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

సంతబొమ్మాళి, జనవరి2 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల ఐదో తేదీ నుంచి జరిగే స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డి.గణపతిరావు కోరారు. గురువారం సంతబొమ్మాళిలోని ఎంఆర్‌సీ వద్ద స్వర్ణోత్సవ గోడపత్రికను మండల విద్యాశాఖాధికారులు జలుమూరు చిన్నవాడు, డి.అర్జునుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సహాధ్యక్షుడు ఫల్గుణరావు, కోశాధికారి సింహాచలం పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్

పలాసరూరల్, జనవరి2(ఆంధ్రజ్యోతి): రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎన్.కళ్యాణచక్రవర్తి కోరారు. పలాస మండలం నీలిభద్రలో రీసర్వే పైలెట్ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ భూముల్లో రీసర్వేను సర్వే అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో డీటీ సునంద, సర్వేయరు గిరి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

టెక్కలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు పక్కనపెట్టి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మాస్టర్ ట్రైనర్ మాధవి సూచించారు. గురువారం మండలంలోని విశ్వనాధపురం, భగవాన్‌పురం గ్రామాల్లో ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారుచేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన రహిత ఎరువులతో పంటలకు మేలు కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అశోక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

కాలువల ఆక్రమణపై చర్య తీసుకోవాలి

టెక్కలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణం ఎన్టీఆర్ కాలనీలో మురుగు కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టెక్కలి ఎన్టీఆర్ కాలనీవాసులు కోరారు.ఈ మేరకు గురువారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్రైనేజీల ఆక్రమణల వల్ల మురుగునీరు బయటకు వెళ్లకపోవవంతో దుర్గంధం వెలువడుతోందని వివరించారు.పట్టణంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు కింద భాగంలో ఉన్న ఎన్టీఆర్‌కాలనీకి చేరుతుందని, కాలువల ఆక్రమణల వల్ల డ్రైనేజీల్లోని నీరు పూర్తిగా వెళ్లడంలేదనితెలిపారు. కాగా పంచాయతీకార్యదర్శి జగన్నాథరావు దృష్టికి కూడా ఈ సమస్యను లింగరాజు, రవికుమార్, హేమసుందర్, శివకుమార్, శ్రీను తదితరులు తీసుకువెళ్లారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్లే కీలకం: సీఐ


అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి,జనవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు నివారణలో డ్రైవర్లే కీలకమని సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం టెక్కలిలో ఆటోడ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనచోదకులు హెల్మెట్లు, సీటుబెల్టులు ధరించాలని కోరారు. కొత్త, అపరిచిత వ్యక్తులు తిరిగితే సమాచారం అందించాలన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ రాము, సిబ్బంది ఉన్నారు.

వేరుశనగలో జిప్సం తప్పనిసరి: ఏవో

నందిగాం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేస్తున్న వేరుశనగలో జిప్సం తప్పనిసరిగావాడాలని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు.గురువారంపాలవలస, కాపుతెంబూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నరేంద్రపురం సర్పంచ్ బి.సన్యాసిరావు, నాయకులు కె.హరిబాబు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా కామరాజు

నందిగాం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల బీజేపీ అధ్యక్షుడిగా దేవపురానికి చెందిన ఏదూరు కామరాజు ఎన్నికయ్యారు. గురువారం దేవపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సూచనల మేరకు నియోజకవర్గ కోకన్వీనర్ నడుపూరు లక్ష్మీనారాయణ, యువమోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, బూరె నరేంద్రచక్రవర్తి ఆధ్వర్యంలో ఎన్నికనిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, పలాస రూరల్, టెక్కలి అధ్యక్షులు ఎ.రామ్‌జీ, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ

పలాస, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వాసుపత్రిలో గురువారం డివిజన్‌లో పనిచేస్తున్న 108 సిబ్బందికి శిక్షణతరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఏఈ ఎంఎస్ జగన్, పర్యవేక్షకులు ఎన్.కృష్ణ గర్భిణులకు అత్యవసర సమయంలో సిబ్బంది చేయాల్సిన విధులు వివరించారు. నవజాత శిశువుల ప్రథమ చికిత్స, వాహనంలో ఉన్న పరికరాల వినియోగం, రోగులకు ఇవ్వాల్సిన మందులు, వాటి వినియోగాలపై అవగాహన కల్పించారు.

మిల్లు యాజమాన్యాల అక్రమాలను అరికట్టాలి

మందస, జనవరి2(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లు యాజమాన్యాలు రైతులకు చేస్తున్న అక్రమాలను అరికట్టాలని జీడీరైస్‌మిల్లు కార్మికులు కోరారు.ఈ మేరకు గురువారం మందస తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైస్‌మిల్లు కార్మికులకు సరైన రేట్లను ఇచ్చేలా చర్యలు చేపట్టాలని,. దాన్యం తేమ పేరుతో అదనపు తూకం అరికట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్ హైమావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, రైతులు, రైస్‌మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

సూరిబాబును ఆదర్శంగా తీసుకోవాలి


సూరిబాబును సన్మానిస్తున్న ఎంఈవో మాధవరావు

జలుమూరు, జనవరి 2: మండలంలోని హరికృష్ణమ్మపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పూతి సూరిబాబును ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంఈవో బి.మాధవరావు కోరారు. గురువారం జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎంసీ శిక్షణతరగతుల్లో సూరిబాబును సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా పనిచేసిన ఘనత సూరిబాబుకు దక్కిందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ దవళ సరస్వతి, పలువురు హెచ్ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

నరసన్నపేటలో గ్రామసభ

నరసన్నపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోగల అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన, చిన్న గుడ్లు పంపిణీ చేస్తున్నారని పలువురు సభ్యులు తెలిపారు. గురువారం నరసన్నపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బి.శంకరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖ అధికారులు హాజరుకాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తారమని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల కార్యవర్గం ఎన్నిక

జలుమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) డిజిటల్ అసిస్టెంట్ల మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం జలుమూరులో ఎంపీడీవో కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా రెడ్డి కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా పల్లి లక్ష్మణ, జనరల్ సెక్రటరీగా బనిశెట్టి జగదీష్, ట్రెజరర్‌గా పేడాడ సుధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా ముద్ద రాజారావు, సీపాన వెంకటసాయి, జమ్మురాము ఎన్నికయ్యారు. ఈ మేరకు డిజిటల్ అసిస్టెంట్లు కార్యవర్గాన్ని ఎంపీడీవో అభినందించారు.

పోస్టు డాక్టరేట్ చేసిన ఇద్దరు అధ్యాపకులు

టెక్కలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు పీహెచ్‌డీ అనంతరం చేసే పోస్టు డాక్టరేట్‌ను పూర్తి చేశారని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ విభాగంలో హెచ్‌వోడీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పల్లి శ్రీహరి ప్రొఫెసర్ కె.సునీల్ శర్మ మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు జర్మనీ డ్రెస్‌డన్ యూనివర్శిటీ పీడీఎఫ్ డిగ్రీని ప్రదానం చేసిందని పేర్కొన్నారు. ఈసీఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వైశ్యరాజు లోకేష్‌రాజు ప్రొఫెసర్ శివనేసన్ మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు సింగపూర్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ పీడీఎఫ్ డిగ్రీని అందజేసిందని తెలిపారు. ఈ మేరకు డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ శ్రీరాములు, హెచ్‌వోడీ అశోక్‌కుమార్‌లు ప్రొఫెసర్ శ్రీహరి, లోకేష్‌లను అభినందించారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా దుర్గారావు

పలాస,జనవరి2(ఆంధ్రజ్యోతి):పలాస జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వి.దుర్గారావు ఏపీరాష్ట్ర రజకకార్పొరేషన్ డైరెక్టర్‌గా గురువారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలో ఎమ్మెల్సీ దువ్వారం రామారావు, ఎమ్మెల్యే గల్లా మాధవి, రజక కార్పొరేషన్ ఛైర్మన్ సి.సావిత్రి సమక్షంలో 15మంది డైరక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

కాలువల ఆక్రమణతో రోడ్డుపై మురుగు నీరు


పాతబస్టాండ్‌లో ప్రధాన రహదారి వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు నీరు

నరసన్నపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : నరసన్నపేటలో ప్రధాన రహదారికి ఇరువైపు ఉన్న కాలువలు ఆక్రమణల పుణ్యమాని మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. పాతబస్టాండ్‌లోని పల్లిపేట జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్ వరకు డ్రైనేజీలపై అడుగడుగునా అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇళ్ల, షాపుల్లో నుంచి మురుగు నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోడ్డుపైకి చేరుతోంది. రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెలువడుతోందని పలువురు వాపోతున్నారు. తక్షణమే డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించి మురుగు నీరు రోడ్డుపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. కాగా రోడ్డుపైకి మురుగు నీరు చేకుండా చర్యలు చేపడతామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.